క్లుప్తంగా

రేపు నీటి సరఫరా నిలిపివేత

కొల్లాపూర్: పట్టణంలో 18న తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగోటం నుంచి కొల్లాపూర్‌కు తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

రాయితీని వినియోగించుకోవాలి

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వం ప్రకటించిన ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని పంచాయితీ కార్యదర్శి నాగేషు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు 25 శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. 2020 సంవత్సరంలో ప్లాట్లు కొనుగోలు చేసి ఎల్‌ఆర్‌ఎస్‌కోసం దరఖాస్తు చేసుకున్న వారు అర్హులని పేర్కొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

వంగూరు: మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ వెంకటమ్మ(49) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఐసీడీఎస్ అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, పలు పార్టీల నాయకులు మృతిదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వ్యవసాయ పనులు లేకపోవడంతో వ్యవసాయ కూలీలు, రైతులు, భక్తులు పోటెత్తారు. కొత్తగా వాహనాలు కొనుగోలు చేసిన భక్తులు తమ బంధుమిత్రులతో జాతరకు తరలివచ్చి, వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించి, విందు వినోదాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సొంతవాహనాలపై తరలివచ్చారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు



కొల్లాపూర్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ దీక్షలు నాలుగో రోజు ఆదివారం కొనసాగాయి. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ చేపట్టడం సరికాదన్నారు. ఎస్సీల్లోని ఒక వర్గానికి మేలుచేసేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. మాదిగలకు అన్యాయం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. నాయకులు మంద నర్సింహమాదిగ, కొండూరు రాములు, శీలం అగ్రస్వామి, నాగులపల్లి లక్ష్మయ్య, పుట్టపాగ నాగరాజు తదితరులు ఉన్నారు.

గుడి నిర్మాణానికి విరాళం



వంగూరు: మండలంలోని ఉప్పల్‌పహాడ్‌లో రజకులు నిర్మిస్తున్న నాగమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఖలీల్ ఆదివారం రూ.20 వేల విరాళం ఇచ్చారు. కులమతాలకతీతంగా ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఆయన కోరారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

చారకొండ: సీఎం సహాయనిధి పేదలకు వరం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన జమ్ముల వెంకటేష్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.58 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును లబ్ధిదారుడికి అందజేశారు. మాజీ వైస్ ఎంపీపీ సాంబయ్య గౌడ్, జమ్ముల శంకర్, నరేందర్ తదితరులు ఉన్నారు.



సాగునీరు లేక రైతన్న ఆగమాగం



భర్కత్‌పల్లిలో ఎండిన వేరుశనగ పంట



చొక్కన్నపల్లిలో ఎండిన వరిపంటను మేస్తున్న పశువులు

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో సాగునీరు లేక రైతన్నలు అల్లాడుతున్నారు. కల్వకుర్తి ఎత్తిపోథల పథకం ద్వారా వస్తున్న కేఎల్‌ఐ కాల్వలో నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. సాగుచేసిన పంటలను కాపాడుకోలేక దిగాలు చెందుతున్నారు. మండలంలోని పోతేపల్లి, వెల్దండ, గుండాల, చొక్కన్నపల్లి, బండోనిపల్లి, చెర్కూర్, భర్కత్‌పల్లి గ్రామాల రైతులు కేఎల్‌ఐ కాల్వను నమ్ముకొని వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. పంటలను సాగుచేసే సమయంలో కేఎల్‌ఐ కాల్వ ద్వారా నీరు పుష్కలంగా ఉండేది. దీంతో రైతులు ఎంతో ఆశతో వరితో పాటు ఇతర పంటలను సాగు చేశారు. దాదాపుగా నెలరోజుల కిందట నుంచి కాల్వలో నీరు లేకపోవడంతో సాగు చేసిన పంటలకు నీరులేక ఎండిపోతున్నారు. గతేడాదిలో మార్చి చివరి నాటి నీరు అందించేవారని ఈ ఏడాదిలో ఏప్రిల్ నెల వరకు నీరు ఇస్తామని కేఎల్‌ఐ కాల్వ అధికారులు హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. కాని ఫిబ్రవరిలోనే కేఎల్‌ఐ కాల్వకు నీరు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 20 రోజులు గడిస్తే సాగుచేసిన పంటలు చేతికి వస్తామని నీళ్లు లేక ఎండిపోతున్నాయని వాపోయారు.

అడుగంటిన బోరు బావులు

బోరుబావులో నీరు రోజురోజుకు అడుగంటి పోతున్నాయి. సాగుచేసిన పంటలను కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొట్రలో దేశమోని సైదులు రెండు ఎకరాల వరిసాగు చేయడంతో బోరు పూర్తిగా ఎండిపోయింది. దీంతో వరిపంటను గేదెలను మేపుతున్నారు. అదే విధంగా చొక్కన్నపల్లిలో శ్రీనివాస్‌రెడ్డి అనే రైతు నాలుగు ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. ఇప్పటికే రెండు ఎకరాలు ఎండిపోవడంతో పశువులను మేపుతున్నారు. భర్కత్‌పల్లిలో మొగిలి అంజయ్య ఒక ఎకరం మొక్కజొన్న, నర్సింహ రెండు ఎకరాల వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయాయి. కేఎల్‌ఐ కాల్వపై ఆధారపడి పంటలను సాగుచేసినట్లు వారు పేర్కొంటున్నారు.

కేఎల్‌ఐ కాల్వలో నీరు లేదు



కేఎల్‌ఐ కాల్వలో పుష్కలంగా నీరు రావడంతో రెండు ఎకరాల్లో వరిపంటను సాగు చేశా. పంట చేతికందే దశలో కాల్వలో నీరు నిలిచిపోయింది. దీంతో పంటను కాపాడుకోవడానికి రాత్రి, పగలు తేడా లేకుండా కష్టపడుతున్నాం. ఇప్పటికే ఒక ఎకరం ఎండిపోయింది. మరో ఎకరం వరిపంటను కాపాడుకోవడానికి పక్క రైతుల బోరుద్వారా కొంతపంటకు నీరు అందిస్తున్నాం.

–శంకరయ్య, రైతు, బండోనిపల్లి

ఇబ్బందులు లేకుండా చూస్తాం

ఒక మోటర్ మాత్రమే నడుస్తోంది. చివరి ఆయకట్టు వరకు నీరు ఇవ్వలేకపోతున్నాం. ఈ సంవత్సరం మాడ్గుల మండలం నాగిళ్ల వరకు సాగు నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాన్నాం. అసంపూర్తిగా ఉన్న కాల్వ పనులు పూర్తి చేశాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

–దేవన్న, కేఎల్‌ఐ కాల్వ డీఈఈ

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం



కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి

తాడూరు: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధిగ్రస్తులకు ఆయన పోషకాహార కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధిగ్రస్తులు ప్రతిరోజు చికిత్సతోపాటుగా అదనపు పోషకాహార కిట్లను వినియోగించుకొని వ్యాధి నుంచి తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ కేవీ స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ 100 రోజుల నిక్షయ్‌శివిర్ కార్యక్రమంలో ఇప్పటివరకు జిల్లాలో 238 క్యాంపులను ఏర్పాటు చేసి 1,32,588 మందికి టీబీ వ్యాధిని పరీక్షించి, ఎక్స్‌రే పరీక్షలు 5,070, సిబినాట్ క్లే పరీక్షలు 1976, మైక్రోస్కోపిక్ పరీక్షలు 348 చేసి కొత్తగా 225 క్షయవ్యాధి గ్రస్తులను గుర్తించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటదాస్, వైద్యాధికారులు డాక్టర్ మన్మోహన్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సంతోష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవం



సహపంక్తి భోజనాలు చేస్తున్న మహిళలు

వెల్దండ: మండలంలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండాల అంబారామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆర్యవైశ్యం సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చెట్లకింద వంటలు చేసి వనదేవతలకు నైవేద్యం సమర్పించారు. అనంతరం సంఘం సభ్యులందరు సహపంక్తి భోజనాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఉప్పు అంజనేయులు, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, మిర్యాల రాజయ్య, పూరి రమేష్, శివ, వాసా అరుణ్, గోవర్ధన్, రవి, జగదీష్, లక్ష్మయ్య, బాలానారాయణ, రమాదేవి, శ్యామలమ్మ, నిర్మలమ్మ, రాజేశ్వరి, అలివేలు, తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకురావాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గోవింద్ నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత నెలలో కొనసాగుతున్న క్యాబినెట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వివేక్, వెంకటస్వామి నేతృత్వంలో మాల మహనాడు ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి వర్గీకరణ అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. దశరథం, మంగి విల్సన్, రమేష్, జగన్‌రాజు, నల్లగడ్డి నాగన్న, యాకోబు, మిద్దె రాములు, మంగి రాజు, ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గూట విజయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



చారకొండ: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు అన్నారు. రంజాన్ ఉపవాసదీక్షలను పురస్కరించుకొని మండలంలోని జూపల్లిలో జామమసీద్‌లో ముస్లింలకు ఆదివారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీద్‌లో ప్రత్యేక పార్థనలు చేశారు. మాజీ సర్పంచ్ బాలేమియా, మాజీ ఉప సర్పంచ్ జగపతి, మైబు యాదవ్, శ్రీనివాస్ గౌడ్, ముస్లింలు సిరాజ్, అజీమ్, ఖదీర్, రశీద్, నజీర్, అబ్దులా, కమాలోద్దీన్ చాందు, ఖాదర్, చాందు, సమీ ఉన్నారు.

ఉపాధి కల్పనే ధ్యేయం



కల్వకుర్తి రూరల్: నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో పని చేస్తున్నట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఇటీవలే నిర్వహించిన మహిళల జాబ్ మేళాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించిన మహిళలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 25న కల్వకుర్తిలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. 50 కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని దాదాపు 5 వేల మంది యువతకు ఉపాధి కల్పించే విధంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమానికి కృషి

అచ్చంపేట రూరల్: ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమానికి కృషి చేస్తానని ఆ సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం అచ్చంపేటలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సంఘ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో తాటికొండ గిరి, కొలంటి భీమాచారి, చంద్రమౌళి, గురుస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ తండాలో హోలీ వేడుకలు

కల్వకుర్తి రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్ తండాలో ఆదివారం హోలీ వేడుకలు నిర్వహించారు. తండాలో ప్రతి సంవత్సరం హోలీ పండగ తర్వాత వచ్చే ఆదివారం వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ అని తండావాసులు పేర్కొన్నారు. తండాలోని చిన్న పెద్ద అనే తేడా లేకుండా ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

వెల్దండ: మండలంలోని చౌదర్‌పల్లి శివాలయంలో హుండీ చోరీకి పాల్పడిన వ్యక్తికి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ కురుమూర్తి వివరాల ప్రకారం జడ్చర్ల ప్రాంతానికి చెందిన అరుణ్‌కుమార్, కల్వకుర్తి చెందిన రామాంజనేయులు ఈనెల 13న షాద్‌నగర్‌లో బైక్‌ను చోరీచేసి వెల్దండ ప్రాంతానికి వచారు. ఈ నెల 15న తెల్లవారు జామున చౌదర్‌పల్లిలోని శివాలయంలో హుండీని ఎత్తుకెళ్తుండగా పోలీసులు వారిని గుర్తించి పట్టుకున్నారు. రామాంజనేయులు తప్పించుకొని పరార్ అయ్యాడు. బైక్‌ను, హుండీని స్వాధీనం చేసుకున్నారు. అరుణ్ కుమార్‌ను కల్వకుర్తి కోర్టులో హాజరుపరచి రిమాండ్ తరలించారు. వారిని పలు పోలీస్ స్టేషన్‌లో ఇద్దరిపై పలు కేసులు ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా బీరప్ప, మల్లప్ప ఉత్సవాలు



తాడూరు: మండలంలోని పాపగల్‌లో కురువల ఆరాధ్య దైవమైన బీరప్ప, మల్లప్ప ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం, మేకల వంశస్తుల మీద బండారు వేశారు. గ్రామంలోని కురువ కులస్తులంత ఐకమత్యంతో ఉత్సవాలలో పాల్గొన్నారు. ఎల్లయ్య, శ్రీశైలం, లింగం, రాంచంద్రయ్య, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు ఆర్థికసాయం అందజేత



వెల్దండ: మండల కేంద్రానికి చెందిన జంగిలి ఈదమయ్య ఇటీవల మృతి చెందాడు. ఆదివారం సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైనా చిన్నారులకు రూ.రూ.10వేల ఆర్థికసాయం చేశారు. ముగ్గురి ఆడపిల్లలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ సాయికుమార్, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి, నాయకులు నిరంజన్, మధుసూధన్‌రెడ్డి, ప్రసాద్, సైదులు, వెంకట్ ఉన్నారు.

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



కల్వకుర్తిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్వకుర్తి: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం బ్లాక్ కాంగ్రెస్, పట్టణ కాంగ్రెస్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్ కుమార్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు చిమ్మల శ్రీకాంత్ రెడ్డిలు మాట్లాడుతూ జగదీశ్‌రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆనంద్ కుమార్, జగన్, జిల్లెల్ల రాములు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

వెల్దండ: మండల కేంద్రంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, కిసాన్‌సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, నాయకులు ఎర్రశ్రీనుముదిరాజ్, శేఖర్, శ్రీనివాస్‌యాదవ్, పుల్లయ్య, భరత్‌గౌడ్, కాడు రాంనాయక్, లాలునాయక్, రామస్వామి, అరుణ్ కుమార్, మల్లేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

అనర్హత వేటు వేయాలి

బల్మూర్: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై అనర్హత వేటు వేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. అనంతరం మండల కేంద్రంలో జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాంప్రసాద్‌గౌడ్, నాయకులు శ్రీనివాసులు, సుధాకర్‌గౌడ్, శివగౌడ్, భాస్కర్, చంద్రమౌళి, కాట్రాజ్ పద్మ, మహేష్, వెంకటయ్య, మశయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేటీఆర్, ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలు..

లింగాల: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. లక్ష్మణ్‌నాయక్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొండల్‌రావు, పట్టణ అధ్యక్షులు పూజారి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా వాటర్ ట్యాంక్ పరిసరాలు



తాడూరు: మండలంలోని అంతారంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ చుట్టూ ఓవర్ ఫ్లో అయిన నీరంతా ట్యాంక్ పరిసరాలలో నిల్వ ఉంటోంది. చుట్టూ పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఈగలకు, దోమలు ఆవాసాలుగు ఏర్పర్చుకొని వృద్ధి చెందుతున్నాయి. స్థానికులు రోగాలబారిన పడుతున్నారు. అధికారులు పరిశీలించి నీరు నిల్వ ఉండకుండ సరి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: ఈ నెల 28న ఢిల్లీలో పార్లమెంట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు మారెడు శివశంకర్ కోరారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ దేశంలో నిర్మాణ రంగం చాల కీలకమైందని 10 కోట్ల కార్మికులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నిర్మాణ రంగానికి సమగ్రమైన చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు విజయ్, భూపేష్, శ్రీనివాస్‌రెడి, రాములు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ విడుదల

ఊర్కొండ: మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామ శివారులోని చెన్నయ్య గుట్టపై ఈ నెల 29న లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఆదివారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి గుడిగానిపల్లిలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం గుడిగాని పల్లిలో విశ్రాంత ఉపాధ్యాయులు జంగయ్య ఇటీవలే మృతి చెందడంతో ఆయన దశదిన కర్మలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.20 వేల కోట్లు కేటాయించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర బడ్జెట్‌లో యువజన రంగానికి రూ.20 వేల కోట్లు కేటాయించాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు శివవర్మ డిమాండ్ చేశారు. ఆదివారం ఆ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యార్థి యువజన రంగాన్ని విస్మరిస్తే సమరశీల పోరాటాలకు సిద్ధం కావల్సి వస్తోందని హెచ్చరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏమాత్రం యువజన రంగానికి నిధులు కేటాయంచకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి రూ.4 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు ఇప్పటివరకు 55 వేల ఉద్యోగాలను మాత్రామే ఇచ్చారని ఆరోపించారు. 40 లక్షల మంది నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకోగా కేవలం 3 లక్షల మందికి పథకాన్ని అమలు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంకర్, సయ్యద్, రమేష్, వర్దం సైదులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యక్తి అదృశ్యమైన ఘటనలో సోమవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం మండలంలోని కుమ్మెర గ్రామానికి చెందిన ఔట రంగయ్య ఈ నెల 15న భార్యతో గొడవపడి ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం తెలువలేదు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్ల గ్రామ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నర్సాయిపల్లి గ్రామానికి చెందిన దంపతులు ఉసేనమ్మ, రామకృష్ణలు బైక్‌పై నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శించుకునేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కుడికిల్ల వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామకృష్ణకు కాలు విరిగింది. ఉసేనమ్మకు తలకు గాయం కావడంతో వెంటనే కొల్లాపూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో..

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి–యాపట్ల మధ్య ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని పట్టుకున్నారు. మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు పేర్కొన్నారు.

కాల్వనీటి కోసం ఎదురుచూపులు



జొన్నబొగుడలో నీరులేక వెలవెలబోతున్న కాల్వ

పెద్దకొత్తపల్లి: కేఎల్‌ఐ కాల్వ కింద ఉన్న చివరి ఆయకట్టు పంటలకు సాగు నీరు అందక పంటలు ఎండుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎంజీఎల్‌ఐ పథకంలో రెండో లిఫ్ట్ అయిన జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి, 3వ లిఫ్ట్ అయిన గుడిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు వెళ్లి అక్కడి నుంచి పంటకాల్వ ద్వారా చంద్రకల్, పెద్దకొత్తపల్లి, పెద్దకారుపాముల, జొన్నలబొగుడ గ్రామాల రైతులకు సాగునీరు అందాల్సి ఉంది. రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న, మామిడి తోటలకు చివరి ఆయకట్టుకు 10 రోజుల నుంచి సాగునీరు రాకపోవడంతో రైతులు నీటి కోసం ఎదురుచూస్తున్నారు. కేఎల్‌ఐ అధికారులు పట్టించుకుని చివరి ఆయకట్టు ప్రాంతానికి నీరువచ్చేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బీరయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తిమ్మాజిపేట: మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు కూకుట్ల బీరయ్య తల్లి బాలమ్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదివారం బాధిత సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు వేణుగోపాల్ గౌడ్, రాజేందర్‌రెడ్డి, వెంకటయ్య, శేఖర్, మల్లేష్ పలువురు నాయకులు ఉన్నారు.